క్లుప్తంగా

అనుమతి లేని క్వారీలపై చర్యలు



క్వారీలను పరిశీలిస్తున్న అధికారులు

పాలసముద్రం: మండల పరిధిలోని క్వారీల్లో పనులు జరగాలంటే తప్పకుండా రికార్డులు అన్నీ ఉండాలని, లేకుంటే చర్యలు తప్పవని తహశీల్దార్ అరుణకుమారి తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తమిళనాడు సరిహద్దుల్లోని తిరుమలరాజుపురం, నరసింహపురం పంచాయతీల్లోని అన్ని క్వారీలను కడప మైనింగ్ అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తహశీల్దార్ అరుణకుమారి, మైనింగ్ అధికారులు మాట్లాడుతూ ప్రస్తుతం క్వారీలో పనులు జరగాలంటే తప్పకుండా అన్ని అనుమతులు ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ చిన్నరెడ్డప్ప, డిప్యూటీ తహశీల్దార్ రిషివర్మ, వీఆర్ఓ లు రమణయ్య, రమేష్ నాయుడు, గ్రామ సర్వేయర్ మధు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరి పేర్లు ఆన్‌లైన్‌లో పెట్టండి



అడ్మిన్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నేతలు

నగరి: మండలంలోని తెరణి దళితవాడలో ఇంటి పట్టాలకు అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరచాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య అన్నారు. మంగళవారం అర్హులందరితో సచివాలయానికి వెళ్లిన ఆయన ప్రతివారికి ఇంటి స్థలాలు కేటాయించాలని అడ్మిన్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెరణి గ్రామంలో పలువురికి ఇంటి పట్టాలు ఇవ్వాల్సి ఉందని, వారందరికీ అందజేయాలన్నారు. దీనిపై సచివాలయ కార్యదర్శి మాట్లాడుతూ ఇచ్చిన అర్జీలను ఆన్‌లైన్‌లో పెట్టించి, నిజమైన లబ్ధిదారులను గుర్తించి న్యాయం చేసే విధంగా చర్యలు చేపడుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిటీ నాయకులు తంగరాజ్, లోకేష్, కార్తికేయన్, గిరిబాబు, మురళి, కస్తూరి, కోమల తదితరులు పాల్గొన్నారు.


బెల్టు షాపులు పెడితే కఠిన చర్యలు



మద్యం సీసాలు, నిందితుడిని కోర్టుకి తీసుకెళ్తున్న ఎస్ఐ

పాలసముద్రం: మండల పరిధిలోని గ్రామాల్లో బెల్ట్ షాపులు పెట్టితే తప్పక చర్యలు తప్పదని ఎస్ఐ చిన్నరెడ్డప్ప తెలిపారు. మంగళవారం గంగమాంబపురం పంచాయతీ బలిజూరు గ్రామంలో బెల్ట్‌షాపులో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయన్న ఫిర్యాదు మేరకు ఎస్ఐ చిన్నరెడ్డప్ప పోలీసు సిబ్బందితో కలసి దాడులు చేపట్టారు. దాడుల్లో మణి అనే వ్యక్తి వద్ద 15 మద్యం సీసాలు పట్టుబడ్డాయి. మద్యం సీసాలను సీజ్ చేసి అతన్ని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. అతనిపై కేసు దర్యాప్తు చేసి చిత్తూరు కోర్టుకి తరలించారు. దాడుల్లో కానిస్టేబుల్ రజని, పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన శిక్షలు



మాట్లాడుతున్న న్యాయవాది రాజేష్

పుత్తూరు: ర్యాగింగ్‌కు పాల్పడితే జైలుపాలై కఠిన శిక్షలు అనుభవించక తప్పదని ప్రముఖ న్యాయవాది రాజేష్ స్పష్టం చేశారు. మంగళవారం ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యాంటీ ర్యాగింగ్ దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాజేష్ మాట్లాడుతూ కొత్తగా కళాశాలలో చేరిన విద్యార్థులు భయాందోళనలకు గురికాకుండా, గౌరవప్రదంగా విద్యనభ్యసించే వాతావరణం కలిగి ఉండాలన్నారు. ర్యాగింగ్ వంటి వికృత చేష్టలకు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. ర్యాగింగ్‌తోపాటు మత్తు పదార్థాల జోలికి వెళ్లరాదని సూచించారు. మత్తు పదార్థాల సమాచారం తెలిస్తే వెంటనే కళాశాల యాజమాన్యానికి, పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ర్యాగింగ్, మత్తుపదార్థాలకు సంబంధించి సుప్రీం కోర్టు స్పష్టమైన మార్గదర్శకాలను విడుదల చేసిందని, అందువల్ల ప్రతి విద్యార్థి ఈ దురాలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులతో ర్యాగింగ్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రమౌళి, అధ్యాపకులు వెంకటకృష్ణయ్య, సుజన, శ్రీదేవి, శ్రీనివాసులు, సూర్యబాబు, వాణిశ్రీ, దేవకి, గాయత్రి, కోటేశ్వరరావు, పద్మావతి, వరలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

దరిచేరని దాతలు

సమాజంలో ఆర్థికంగా బాగున్న వారు పేదలకు సాయమందించాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం పీ–4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అయితే దీనిపై ధనిక వర్గాల వారు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఎలాగైనా సూచించిన ధనిక వర్గాలను ఒప్పించాలని జిల్లా అధికారులు కింది స్థాయి అధికారులపై ఒత్తిడి పెంచుతున్నారు. దీంతో అధికారులకు పీ–4 పెద్ద తలనొప్పిగా మారిందని తెలుస్తోంది. పీ–4పై సమావేశం ఉందంటే చాలు ఇదేం బాధరా స్వామీ అంటూ అధికారులు తలలు పట్టుకునే పరిస్థితి కనిపిస్తోంది.

– నగరి

- పేదలను దత్తత తీసుకోవడానికి ముందుకురాని మారాజులు
- పీ–4 కార్యక్రమం ఆచరణ సాధ్యమేనా?
- బంగారు కుటుంబాలు.. దాతల వివరాలు అంకెల గారడీ
- లక్ష్యం కోసం మమ అనిపించేస్తున్న అధికారులు
- రేషన్ షాపు డీలర్లు, సెక్రటరీలు, పార్టీ నేతలే దాతలు



పీ4 సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది

నగరి నియోజకవర్గంలో పీ-4 వివరాలు

మండలం	బంగారు కుటుంబాలు	మొత్తం కుటుంబ సభ్యులు	దాతలు
నగరి	1572	4486	11
నగరి మున్సిపాలిటీ	820	2449	227
నింద్ర	1464	4029	22
విజయపురం	1272	3417	10
పుత్తూరు	898	2398	138
పుత్తూరు మున్సిపాలిటీ	1084	2965	155
వడమాలపేట	2751	1036	156
మొత్తం	9861	20780	719

పిల్లర్లు ఎక్కడ?

పీ–4 అంటే పబ్లిక్, ప్రైవేటు, పీపుల్ పార్టనర్ షిప్ అనిఅర్థం. ఇందులో నలుగురుంటారు కనుక వీరిని ఫోర్ పిల్లర్లుగా భావిస్తూ ఈ కార్యక్రమాన్ని పీ–4గా పిలుస్తున్నారు. ప్రతి ఇంటా అభివృద్ధి, ప్రతీ జీవితానికి ప్రగతి అనే నినాదంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా సమాజంలో ఆర్థికంగా బాగున్నవారు, ఉద్యోగ, ఉపాధ్యాయులు, ఎన్ఆర్ఐలు కొన్ని బీపీఎల్ కుటుంబాలను దత్తత తీసుకుని ఆర్థిక సాయం చేయవచ్చు. మెంటర్స్‌గా వ్యవహరించి వారికి అవసరమైన ప్రభుత్వ పథకాలు అందేలా చేసి అభివృద్ధి చెందేలా చూడాల్సి ఉంటుంది. ఈ కార్యక్రమం ఈ ఏడాది నుంచి 2029 వరకు కొనసాగుతోంది. తక్కువలో తక్కువ కనీసం నాలుగు కుటుంబాలనైనా ధనిక వర్గాలు దత్తత తీసుకోవాలి.

పొంతన లేని లెక్కలు

నగరి నియోజకవర్గంలో 9861 బీపీఎల్ కుటుంబాలను గుర్తించగా ఇప్పటివరకు బంగారు కుటుంబాలకు సాయం చేస్తామని 719 మంది దాతలు ముందుకు వచ్చినట్లు గణాంకాలు చెబుతున్నాయి. వారిలో రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులు, వివిధ శాఖల అధికారులు, వ్యాపారులు ఉన్నట్లు పేర్కొంటున్నారు. వీరు 9847 కుటుంబాలను దత్తత తీసుకున్నట్లు ప్రభుత్వ వెబ్‌సైట్లో ఉన్న గణాంకాలు చెబుతున్నాయి. మిగిలిన కుటుంబాలకు త్వరలో దాతలను ఏర్పాటు చేస్తామని అధికారులు అంటున్నారు. ఒక దాత ఒక కుటుంబాన్ని దత్తత తీసుకునేందుకే ఆసక్తి చూపని తరుణంలో ఇక్కడ 719 మంది దాతలు ఇంతమంది కుటుంబాలను ఎలా దత్తత తీసుకున్నారనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా కనిపిస్తోంది. వెబ్‌సైట్‌లోని లెక్కలకు వాస్తవాలకు పొంతన కుదరడం లేదు. ఎంపిక చేసిన పేదల్లో చనిపోయినవారు, ఇతర రాష్ట్రాలకు చెందిన వారు, భూస్వాములు కూడా ఉండడంతో ఎంపిక ఏమాత్రం జరిగిందో తేటతెల్లమవుతోంది. పీ–4 పథకానికి దాతలు, మెంటర్లు ఎంపిక ప్రక్రియలో రేషన్ షాపు డీలర్లకు పదేసి కుటుంబాల చొప్పున కేటాయించగా మిగిలిన వారిని సెక్రటరీలకు, పార్టీ నేతలకు కేటాయించారు. దారిద్ర్యంలో ఉన్న అన్ని కుటుంబాలను దత్తత తీసుకున్నట్లు లెక్క తేలిపోయింది.

లక్ష్య సాధనకు తంటాలు

సంపద సృష్టిస్తాం.. మీ బతుకులు మారుస్తాం.. ఉద్యోగాలు ఇస్తాం అంటూ ఎన్నికల ముందు ఊదరగొట్టిన చంద్రబాబునాయుడు ఇప్పుడు పేదలకు సంక్షేమ పథకాలు అందించలేక పీ–4 అంశాన్ని తెరపైకి తేవడాన్ని పలువురు తప్పుపడుతున్నారు. ఏవేవో కలలుగన్న ప్రభుత్వ ఉద్యోగులకు పీ–4 తలనొప్పిగా మారింది. కూటమి పెట్టిన ఈ బంగారు కుటుంబాల కోసం ఇంట్లో బంగారాన్ని అమ్ము కోవాలా, ఈ పథకంలోకి తాము రామని ఉద్యోగ వర్గాలు ఇప్పటికే స్పష్టం చేశాయి. ఈ తరుణంలో సంబంధిత అధికారులు తమకు విధించిన లక్ష్యాలను చేరుకునేందుకు నానా తంటాలు పడుతున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా బంగారు కుటుంబాలకు డబ్బులు సాయం చేయకపోయినా ఫర్వాలేదని, వారికి మెంటర్లుగా ఉంటే చాలని నచ్చజెబుతూ దాతల పేర్లు నమోదు చేస్తున్నారనే వాదన వినిపిస్తోంది.

20,780 మంది గుర్తింపు

నియోజకవర్గంలోని నగరి, పుత్తూరు, విజయపురం, వడమాలపేట, నింద్ర మండలాల్లో మొత్తం 9861 బీపీఎల్ కుటుంబాలు, ఇందులో మొత్తం 20780 మంది జనాభా ఉన్నట్లు తేల్చారు. ఈ కుటుంబాల్లో ఇప్పటిదాకా బ్యాంకు ఖాతాలు లేనివారు, గ్యాస్, కరెంటు సౌకర్యాలు లేనివారు, తాగునీటి సదుపాయానికి నోచుకోనివారిని ఆయా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు గుర్తించారు. వీరిలో ఇప్పటివరకు 9861 కుటుంబాలకు దాతలను సూచించగా, వీరిలో 9847 కుటుంబాలకు 719 మంది దాతలు సాయం అందించేందుకు అంగీకారం చెప్పినట్లు అధికారులు ధ్రువీకరించారు.

మంచి ఆలోచనలు కలిగి ఉండాలి



మాట్లాడుతున్న డీఎస్పీ



సమావేశానికి హాజరైన విద్యార్థులు

– యాంటీ డ్రగ్స్, యాంటీ ర్యాగింగ్ అవగాహన సదస్సులో డీఎస్పీ

నగరి: యువత మంచి ఆలోచనలు కలిగి ఉండాలని డ్రగ్స్, ర్యాగింగ్‌లకు దూరంగా ఉండాలని డీఎస్పీ సయ్యద్ అబ్దుల్ అజీజ్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన యాంటీ డ్రగ్స్, యాంటీ ర్యాగింగ్ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. డ్రగ్స్ వాడకంతో సమాజంలో వచ్చే దుష్పరిణామాలు, ఆరోగ్య సమస్యలను విద్యార్థులకు వివరించారు. యువత దేశానికి పట్టుకొమ్మలని, సమాజాభివృద్ధికి తద్వారా దేశ అభివృద్ధికి తోడ్పడాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు తమ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా డ్రగ్స్ వినియోగిస్తున్నట్టు అనుమానం వచ్చినా, విక్రయిస్తున్నట్టు తెలిసిన పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరంగా ఎలాంటి శిక్షలు ఉంటాయో వివరించారు. విద్యార్థులందరూ తమ తోటి విద్యార్థులతో సోదరభావంతో మెలగాలని, సత్సంబంధాలు ఏర్పరచుకోవాలని తెలిపారు. జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ క్రిష్ణకిషోర్ మాట్లాడుతూ ఒక వ్యక్తి డ్రగ్స్‌కి అలవాటుపడితే మాన్పించడం చాలా కష్టమని డ్రగ్స్ వినియోగంతో ఆ వ్యక్తి ఏం చేస్తాడో తనకే తెలియదని, మత్తులో నిద్రిస్తాడని, క్రూరమైన ఆలోచనలు కలిగి ఉంటాడని తెలియజేశారు. విద్యార్థులు, సామాన్య ప్రజలు పోలీసు వారికి తమ వంతు సహాయ, సహకారాలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వెంకటాచలపతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా పాలకుండల ఉత్సవం

నగరి: మున్సిపల్ పరిధిలోని కీళపట్టు ప్రాంతంలోని భద్రకాళి అమ్మవారికి మంగళవారం ఆడిపూరంను పురస్కరించుకొని పాలకుండల ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని పుష్పాలతో అలంకరించారు. ఊరి పొలిమేరల్లో ఉన్న పొన్నియమ్మ ఆలయం వద్ద నుంచి ఉత్సవ నిర్వాహకులు చంద్రారెడ్డి పువ్వులతో అలంకరించిన ప్రధాన గెరిగను ఎత్తుకున్నారు. మిగిలిన పాలకుండలను భక్తులు తలపై ఎత్తుకొని ఊరేగింపుగా బయల్దేరి మార్గమధ్యంలో పచ్చమ్మ ఆలయానికి చేరుకున్నారు. పచ్చమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి గెరిగలకు గుమ్మడికాయల దిష్టి తీసిన అనంతరం మేళతాళాలు, ఆటపాటలతో ఊరేగింపును ప్రారంభించారు. గెరిగెతో పాటు మహిళలు పాలకుండలను ఊరేగింపుగా భద్రకాళి ఆలయం వరకు తీసుకెళ్లారు. ఊరేగింపుగా తీసుకెళ్లిన పాలతో అమ్మవారి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఆలయం వద్ద పొంగళ్లు పెట్టారు. అమ్మవారికి నైవేద్యం పెట్టి, కర్పూర హారతులిచ్చారు. భక్తులకు అన్నదానం చేశారు.



పాలకుండలు ఊరేగింపుగా తెస్తున్న భక్తులు

ఉపాధి సామాజిక తనిఖీపై ప్రజావేదిక

నగరి: మండలంలో 2024–25కు సంబంధించిన ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన రూ.6.98 కోట్ల పనులపై మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో 18వ సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. ఉపాధి పనులకు సంబంధించి ఖర్చు చేసిన నిధులను వివరించారు. మండలంలోని మొత్తం 665 పనులను చేపట్టారని, ఇందులో రూ.6.23 కోట్లను కూలీలకు వేతనాలుగా చెల్లించినట్టు తెలిపారు. మెటీరియల్‌కు రూ.74.68 లక్షలు చెల్లించినట్టు వెల్లడించారు. డ్వామా పీడీ రవికుమార్, ఎస్టీఎం లోకేశ్వరిరెడ్డి, ఎస్ఆర్‌పీ మురద్, ఎంపీపీ భార్గవి, జడ్పీటీసీ గాంధీ సమక్షంలో సామాజిక తనిఖీ సిబ్బంది తాము కనుగొన్న అంశాలను అధికారులకు వివరించారు. తనిఖీ పరిశీలించిన అధికారులు మస్టర్లలో అవకతవకలు ఉన్నట్టు గుర్తించారు. ఇందుకోసం రూ.69,277 రికవరీకి ఆదేశించారు. కొన్ని ప్రాంతాల్లో పనిరోజుల కన్నా ఎక్కువ వేతనం ఇచ్చినట్లు, కొన్ని ప్రాంతాల్లో తక్కువ రోజులకు ఎక్కువ వేతనం ఇచ్చినట్లు తనిఖీ సిబ్బంది గుర్తించారు. దీనిపై పీడీ మాట్లాడుతూ అవినీతికి పాల్పడే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ఉపాధి హామీలో హార్టీకల్చర్‌కు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. రైతులకు అవసరమైన పండ్ల మొక్కలు ఇస్తున్నామన్నారు. ఏపీఓలు కవిత, ఇందుజ, జేఈలు మధుబాబు, కిషోర్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.



తనిఖీ సిబ్బంది తెలిపే వివరాలు నమోదు చేసుకుంటున్న అధికారులు

గంజాయి మత్తులో వీరంగం



రక్తగాయాలతో కుమారస్వామి

నగరి : గంజాయి మత్తులో యువత పలు అకృత్యాలకు పాల్పడుతున్నారు. నగరి మండలంలో మంగళవారం సాయంత్రం కుమారస్వామి అనే వ్యక్తిపై గంజాయి మత్తులో ఓ యువకుడు దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన చోటు చేసుకుంది. బాధితుడు కుమారస్వామి తెలిపిన వివరాల మేరకు.. ఓజీ కుప్పానికి చెందిన అతడు మంగళవారం పుత్తూరులోని ఆస్పత్రిలో కంటి వైద్యం చేసుకొని తిరిగి వస్తుండగా నాగరాజకుప్పం మార్గంలో అడ్డుపడ్డ ఒక యువకుడు గంజాయి మత్తులో డబ్బులు ఇవ్వాలని పట్టుబట్టాడు. ఇచ్చేందుకు నిరాకరించడంతో బాటిల్‌తో తలపై కొట్టాడు. దీంతో కుమారస్వామి తలకు తీవ్రగాయమైంది. ఇరుగుపొరుగు వారు అక్కడకు చేరుకునే సరికి యువకుడు పరారయ్యాడు. గాయపడిన కుమారస్వామిని వారు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఇటీవల బైక్‌పై వస్తున్న ఒకరి వద్ద నుంచి సెల్‌ఫోన్, నగదు దోచుకున్నట్లు స్థానికులు తెలిపారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దాడికి పాల్పడిన యువకుడి కోసం గాలింపు చేపట్టారు.

క్యాషియర్ ఆలస్యంతో ఖాతాదారులకు ఇక్కట్లు

– చంటి బిడ్డలతో క్యూ కట్టిన ఖాతాదారులు



ఇండియన్ బ్యాంకులో క్యూలో ఎదురు చూస్తున్న ఖాతాదారులు

కార్వేటినగరం: క్యాషియర్ ఆలస్యంగా రావడంతో ఖాతాదారులకు ఇబ్బందులు తప్పక క్యూలో బారులు తీరిన ఘటన మేజర్ పంచాయతీ కార్వేటినగరంలోని ఇండియన్ బ్యాంకులో మంగళవారం చోటు చేసుకుంది. ఖాతాదారుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కార్వేటినగరంలోని ఇండియన్ బ్యాంకులో అత్యధికంగా ఖాతాదారులు ఉన్నారు. వీరితోపాటు డ్వాక్రా మహిళల ఖాతాలు ఎక్కువగా ఉండడంతో ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. మంగళవారం క్యాషియర్‌గా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది బ్యాంకు ప్రారంభమై గంట సమయం గడుస్తున్నప్పటికీ విధులకు హాజరు కాలేదు. దీంతో వినియోగదారులకు ఇబ్బందులు వర్ణనాతీతంగా మారింది. ఖాతాదారులు మాట్లాడుతూ నగదు కోసం గంటల తరబడి క్యూలో నిల్చున్నామని ఎంతకీ క్యాషియర్ రాకపోవడంతో లావాదేవీల కోసం వచ్చిన బాలింతలు, వృద్ధులకు ఇబ్బంది పడ్డామన్నారు. ఖాతాదారులకు సకాలంలో సేవలు అందించాలని డిమాండ్ చేశారు.

లులు సంస్థకు ప్రభుత్వ భూములు ఇవ్వొద్దు

– ఆర్టీసీ కార్మికుల ఆందోళన



పుత్తూరు ఆర్టీసీ డిపో వద్ద కార్మికుల ధర్నా

పుత్తూరు: గవర్నర్‌పేట–1, 2 ఆర్టీసీ డిపోలకు చెందిన ప్రభుత్వ భూములను లులు అనే ప్రైవేటు సంస్థకు ఇవ్వరాదని నేషనల్ మేజ్దూర్ యూనియన్ తిరుపతి జిల్లా అధ్యక్షుడు ఎస్.జె.పెరుమాళ్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం పుత్తూరు ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పెరుమాళ్ మాట్లాడుతూ ఆర్టీసీలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఎన్ఎంయూ కార్మికులు పోరాటం చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం న్యాయమైన సమస్యల పరిష్కారానికి ముందుకు రావాలని కోరారు. విద్యుత్ బస్సులను ఆర్టీసీ ద్వారానే నిర్వహించాలని, ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వరాదంటూ డిమాండ్ చేశారు. తక్షణమే పీఆర్‌సీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ డిపో తరలిపోవడాన్ని ఆపాలని కోరారు. సుమారు 8 వేల ఖాళీలను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేయాలని కోరారు. పదోన్నతులు వెంటనే కల్పించాలని కోరారు. ఉద్యోగులకు అనారోగ్య సెలవులకు పూర్తి జీతం ఇవ్వాలని, మహిళలకు పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంస్థాపరమైన వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పలు సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కడప జోనల్ వైస్ ప్రెసిడెంట్ కె.ఆర్ముగం, పుత్తూరు డిపో అధ్యక్షుడు సుందరం, నాయకులు శివకుమార్, ధనరాజ్, రమేష్‌బాబు, మనోహర్, వినోద్‌కుమార్, నాగరాజు, రమేష్, దొరబాబు, వాసు, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

కేంద్ర బృందం పరిశీలన



వెజ్జుపల్లి గ్రామంలో కేంద్ర బృందం

గంగాధరనెల్లూరు: స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ–2025పై కేంద్ర బృందం మంగళవారం పరిశీలించింది. గంగాధరనెల్లూరు మండలం వెజ్జుపల్లి గ్రామంలో ఏఎంఎస్ టీం, స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ–2025 కార్యక్రమంలో భాగంగా కేంద్ర బృందం సభ్యులు దాము, గోవింద స్వామి తదితరులు పర్యటించారు. ప్రధానంగా గ్రామంలో పారిశుధ్యం, మురుగునీటి నిర్వహణ, తడి చెత్త–పొడి చెత్త సక్రమ నిర్వహణ, సంపద తయారీ షెడ్లను సందర్శించారు. సర్పంచ్ హరిప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ సీఈఓ రవికుమార్ నాయుడు, జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్, డిప్యూటీ ఎంపీడీఓ శివయ్య, బాల సుందరం, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, ఎంఆర్‌సీ మనోహర్ బాబు పాల్గొన్నారు.

మసీదు ఆదాయంపై తప్పుడు వార్తలు రాయొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న ముస్లింలు

కార్వేటినగరం: జామియా మసీదు ఆదాయంపై తప్పుడు వార్తలు రాస్తే సహించబోమని ముస్లింలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మసీదు ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముస్లింలు మాట్లాడారు. జామియా మసీదు ఆదాయంలో ఎలాంటి అవకతవకలు జరగడం లేదన్నారు. వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ గౌస్ మొహిద్దీన్ మసీదుకు సంబంధించిన ఆదాయంపై ఆడిట్ నిర్వహించాలని, ఇది ఏడు రోజుల్లో పూర్తి చేయాలని కోరారు. దీంతో మసీదు అధ్యక్షుడు హమీద్‌ఖాన్ అందుకు అంగీకరించారు. దీనిపై కొన్ని పత్రికల్లో అవాస్తవాలను ప్రచురించారు. అవతవకలు జరిగాయని అవాస్తవాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం మంచిది కాదని హెచ్చరించారు.

తాగునీటి సమస్య పరిష్కారం



తాగునీటిని సరఫరా చేస్తున్న సర్పంచ్ గోవిందయ్య

వెదురుకుప్పం: మండలంలోని బొమ్మయ్యపల్లె పంచాయతీ బొమ్మయ్యపల్లె ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపినట్లు స్థానిక సర్పంచ్, వైఎస్ఆర్ సీపీ పంచాయతీ వింగ్ జిల్లా కార్యదర్శి గోవిందయ్య తెలిపారు. మంగళవారం కొత్తగా నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకు నుంచి కుళాయిల ద్వారా తాగునీటిని ప్రజలకు అందించారు. సర్పంచ్ మీడియాతో మాట్లాడుతూ బొమ్మయ్యపల్లె కాలనీలో తరచూ తాగునీటి నీటి సమస్య ఉత్పన్నమయ్యేదని తెలిపారు. గ్రామంలో 500 పైగా కుటుంబాలు నివాసం ఉన్నా నీటి కొరత పట్టి పీడిస్తుండడంతో అప్పటి మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి దృష్టికి తీసుకెళ్లిన వెంటనే జలజీవన్ మిషన్ కింద రూ.22 లక్షలు నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. ఈ నిధులతో 40 వేల లీటర్ల నీటి సామర్థ్యం గల నీటి ట్యాంకు నిర్మించి పంచాయతీ నిధులతో కొత్తగా బోరు వేసినట్లు పేర్కొన్నారు. పనులు పూర్తి అయి కొళాయిలు ఏర్పాటు చేసి నీటిని సరఫరా చేశామన్నారు. గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

శుభ్రపడిన బస్ షెల్టర్



బస్ షెల్టర్‌ను శుభ్రపరుస్తున్న పారిశుధ్య సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

నగరి: బైపాస్ సర్కిల్ సమీపంలోని బస్ షెల్టర్ మద్యం సీసాలతో, ప్లాస్టిక్ గ్లాసులతో అధ్వాన్నంగా ఉండడంపై సాక్షి దినపత్రికలో మంగళవారం ప్రచురితమైన 'బార్లుగా బస్ షెల్టర్లు' అనే వార్తకు అధికారులు స్పందించారు. ఉదయం పారిశుధ్య సిబ్బందితో వచ్చిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తం బస్‌షెల్టర్‌ను శుభ్రపరిచారు. బస్ షెల్టర్ శుభ్రపడడంపై ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా గంగ జాతర

శ్రీరంగరాజపురం: మండలానికే తలమానికమైన 49కొత్తపల్లిమిట్ట, నెలవాయి గంగమ్మ జాతరకు మంగళవారం జనం, భక్తులు పోటెత్తారు. అమ్మవారికి కర్పూర హారతులు పట్టి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మరి కొందరు అమ్మవారికి అంబళ్లు పోశారు. నడి వీధిలో కొలువుదీరిన గంగమ్మ తల్లికి తొలుత వంశపారంపర్య ధర్మకర్తలు విశేష పూజలు చేసి జాతరను ప్రారంభించారు. బలి చాటింపు తట్టతో గ్రామం మొత్తం తిరిగి సమృద్ధిగా వర్షాలు కురిసి, పంటలు పండాలని అమ్మవారిని వేడుకున్నారు. గ్రామం నుంచి శ్రీఆరిమాను గంగమ్మ ఆలయం వరకు మేళ తాళాలతో బాణసంచా నడుమ పొంగళ్లను తీసుకువచ్చి ఆవరణలో పెట్టారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడంతో యువకులు ఉత్సాహంగా డ్యాన్స్‌లు వేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate


PLOTS FOR SALE

■చంద్రగిరి టౌన్‌లో, తుడా అనుమతి పొందిన స్వర్ణముఖి నగర్‌లో 30x55 వెస్ట్ ఫేసింగ్ ప్లాటు అమ్మకమునకు కలదు. Contact Cell:72004 71656.

TOLET

■ చిత్తూరు, ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఇండస్ట్రియల్ కంపెనీల అవసరాలకు అనుగుణంగా 3750 (కార్పెట్), 3500(కార్పెట్), 7250 చ.అ. (మూడు వైపులా రోడ్డు) & 2200 చ.అ ఖాళీ ప్లాట్లు బాడుగకు కలవు. వారి అవసరాలకు అనుగుణంగా Godowns నిర్మించి ఇవ్వబడును లేదా వారే నిర్మించుకున్న పర్వాలేదు. సంప్ర : 99451 00777, 88808 77111.

TOURS & TRAVELS



■కొల్హాపూర్, షిర్డీ పండరిపురం ముంబై. 3 జ్యోతిర్లింగాలు. తేది 24.10.25, 6 రోజులు 13,000/- (రైలు, భోజనం, Ac బస్సు+ Ac రూం) కె.వాసు, నెల్లూరు. 9491340504

Wanted

■Wanted Staff @ Tirupati Auto Showroom and Service Center Manager: 1, Marketing & Sales Executive: 4, Receptionist:1, Mechanic: 2. Send your resumes to Whats App: 8919431296, Email: gev.tpt@gmail.com

■తిరుపతి జిల్లాలో 132 KVSS Pakalaలో పనిచేయుటకు అనుభవం కలిగిన Telecom Works (or) ITI Electronics-1 No OC (PH (W) (VH) అభ్యర్థులు కావలెను. ఆసక్తిగలవారు సంప్రదించండి సెల్: 94403 92940.

■ప్రముఖ MNC కంపెనీలోకి యువతీ, యువకులు కావలెను. వర్క్ ఫ్రం హోం కలదు. జీతం :18K-30K,అర్హత:10th,ఇంటర్,డిగ్రీ డిప్లొమా, ITI. సంప్ర: 8792811822, 7349209240.

■డ్రైవర్ కావలెను జీతం18000 లిబర్టీ ఎస్‌టీకు స్టీల్ ప్రైవేట్ లిమిటెడ్, అంకులు పాటూరు గ్రామం, చిల్లకూరు మండలం, తిరుపతి జిల్లా. సంప్ర: 99085 15099, 70834 19321, 95020 06229.

■ప్రముఖ సెక్యూరిటీ సంస్థకు నాయుడుపేట, శ్రీసిటీ, తిరుపతిలలో డ్యూటీ చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను జీతం Rs. 15500/- to 18000/- 9908954788, 7702577508

■కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ. 15 వేలు - 40వేలు, ఫ్రీ రూం+భోజనం. Hyd. 7995365999

■ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం జీ 20K. ఫోన్. 8977639662, 8977639663

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని పూర్తిగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరమివ్వండి మీ పాఠకులకు కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

వాణిజ్యేతర ప్రకటనకు రూ. :375/- ప్రతి ప్రకటనపై అదనపు లైనుకు రూ.:90/- G.S.T 5% అదనం

CONTACT : 9440166091, 9951602970